# అరణ్య రోదనం



పులికంటి కృష్ణారెడ్డి

అది కాకులు దూరని కారడవి. ఆ కారడవిలో కాలి బాట. ఆ కాలిబాట మీద రెండు రోజులుగా కాలికి కాలు కొట్టుకొంటూ నడుస్తున్నాను. ఎందుకు నడుస్తున్నానో అర్థం గాకనే నడుస్తున్నాను.

అర్థం కానప్పుడు మనిషి ఆందోళన పడతాడు. అందులో నుంచి కోలుకోవడానికి ఆలోచిస్తాడు. ఆలోచనకు అందకపోతే ఆవేదన పడతాడు. ఆ ఆవేదన నుంచి బయట పడడానికి మార్గాల్ని అన్వేషిస్తాడు.

నా మార్గం అడవి మార్గమయింది. చైతన్య చిత్రాలైన విప్లవాలకు, వినూత్న భావాలకు ఈ అడవులు సృష్టిలో ఒక భాగం.

అసలు సృష్టిని జయించిన మానవుడు తన్ను తాను జయించుకోలేకపోతున్నాడు. తా నెవరో తనకు తెలిస్తే గదా తన్ను తాను జయించుకోవడానికి? ఆ తెలుసుకోవడానికే మహర్షులంతా అరణ్యాలే అనువైన ప్రదేశాలనుకొన్నారు. అక్కడికి వెళ్ళి కొందరు ఒంటి కాళ్ళమీద నిలబడినారు. కొందరు ముక్కులు మూసుకొని కూర్చున్నారు. బుద్ధభగవానుడు సరాసరి బోధిచెట్టు కిందికి వెళ్ళి కూర్చున్నాడు.

నేను అంతటి వాణ్ణి కాదు. నన్ను గురించి తెలుసుకోవాలన్న కోర్కె అంతకన్నా లేదు. అయినా చీమలు దూరని చిట్టడవిలో, కాకులు దూరని కారడవిలో రెండు రోజులుగా నడుస్తున్నానంటే నాకూ అర్థం · గాకనే నడుస్తున్నాను.

నా కొక ఇల్లుంది. ఆ ఇల్లు ఒక వీథిలో ఉంది. ఆ వీథి ఒక పట్టణంలో ఉంది. ఆ వీథికీ, ఆ పట్టణానికీ కూడా పేర్లున్నాయి. ఆ పేర్లు అవసరమా? ఎందుకూ, గాంధీ పేరు పెట్టుకొని బ్రాందీ అంగళ్ళు నడుపుకొంటున్న దేశంలో.

నేను ఆ మహారణ్యం గుండెల్లో జొరబడి నడుస్తున్నా నా తాహతుకు మించిన భావపరంపర నా గుండెల్లో అలలు అలలుగా లేస్తున్నా నా మనస్సు మాత్రం నా ఇంటి చుట్టూ, వీథి చుట్టూ తిరుగుతూనే ఉంది.

** ** **

పెద్దా, చిన్న తేడా లేకుండా అందరు వాణ్ణి 'రే కిష్టా' అని పిలుస్తుంటారు.

వాడు ఉండేది బస్ స్టాండ్‌లో. చేసేది క్లీనర్ పని.

వాడు మాల వేసుకొన్నాడు.

అంతకు ముందు రోజు 'ఏరా? నా కొడకా, ఆ అద్దం ఎట్లుండాదో సూడు. దాన్ని తుడవకుండా పొయ్ ఆడ నిలబడుకోని అరట్లు కొట్తావుండావ్ !' అని డ్రైవర్ దబాయిస్తే - "రేపు కలెక్షన్ సరిగ్గా కట్టకపోతే నువ్వు గాదురా వోనర్ దగ్గర చెక్కదెబ్బలు తినేది. నేన్రా బేటా నేను. అర్కోణం... కంచి... కంచి... అర్కోణం... అని మూడు దినాలుగా గతకని నా కొడుకు మాదిర గొణుక్కుంటా వుండావే? గొంతెత్తి అరిస్తే సస్తావా?" అని కండక్టర్ చెరొక పక్క వాయించేవాళ్ళు. ఇప్పుడు "సామీ ! సామీ ! ఆ అద్దాన్ని కొంచెం తుడువు సామీ !" అని డ్రైవర్, "అయిదు నిముషాలే టైముంది. పది సీట్లు ఖాళీగా ఉండాయ్. కొంచెం గట్టిగా అరువు సామీ" అని కండక్టర్ ఎంతో గౌరవంగా మాట్లాడుతున్నారు.

నిద్ర లేస్తూనే నాకు కాఫీ పిచ్చి. సచ్చిదానందానికి సారాయి పిచ్చి. ఎవరి పిచ్చి వాళ్ళ కానందం - ఎవరి కంపు వాళ్ళ కింపు మాదిర. కాఫీ హొటల్లో కాఫీ ఉంది. ఆ కాఫీ హొటల్ వెనక పక్క ఒక సన్నని సందు ఉంది. ఆ సందులో పందులు తిరుగుతుంటాయి. అక్కడే ఒక సారాయి దుకాణం ఉంది. సందు మున్సిపాల్టీ వాళ్ళది. సారాయి దుకాణం సాక్షాత్తు ప్రభుత్వం వాళ్ళది. నా పిచ్చి తీర్చుకోవడానికి నేను నిద్ర కండ్లతో కాఫీ హొటల్‌కు పోతూంటే అప్పటికే ఆ సందులో దూరి తన పిచ్చి తీర్చుకొని మూతి తుడుచుకొంటూ ఎదురు పడేవాడు సచ్చిదానందం. మాల వేసుకొన్నాడట. మనిషి ఆ ప్రాంతాల్లో కనిపిస్తే ఒట్టు.

ఎనుముకు చీర గట్టే ఎగాదిగా చూస్తాడు మూర్తి. చూపుల్లో చూపు కలవాల్సిన అవసరమే లేదు. తనవైపు చూసినట్లు తోస్తే చాలు. పనీ పాటా పక్కన బెట్టి... గాలం ఒకటి చేత బట్టి తాడో పేడో తేల్చుకుంటే గానీ వదిలిపెట్టడా రసిక శిఖామణి.

మాల వేసుకొన్నాడు. ఆడది కంటపడ్తే ఆమడ దూరానికి తొలగిపోతున్నాడు - అది గూడా తల వంచి.

మా ఇంటికి సరిగ్గా నాలుగో గడప చలమయ్యది. ఏ గాలి కా చాప అన్నట్లుగా చలమయ్య సీజనల్ బిజినెస్ చేస్తుంటాడు. "ఏం చలమయ్యా? ఎట్లుంది వ్యాపారం?" అంటే చాలు. "అంత తమ చేతి చలవేగదండీ. పైసాకు పైసాయే" అంటాడు. మహానుభావుడు మన చేత్తో అమ్మింది కానీ, అంతకు ముందు కొనింది గానీ లేకపోయినా.

ఇక ముష్టివాడు ఇంటి ముందర నిలబడ్తే మూడు వీథుల అవతలకి తరిమికొట్టే గానీ పుణ్యాత్ముడికి మనసు కుదుటపడదు. తాగేది బీడీ అయితే మాత్రం ఏం? మనిషి నిత్యాగ్నిహోత్రుడు. అటు ఇటు చూస్తా ఒక్క అగ్గిపుల్లకోసరం కనీసం అయిదు మంది ముందరైనా చేయి చాస్తాడు. కర్మగాలి ఎవడైనా "అగ్గిపెట్టె జేబులో ఉన్నట్లుందే?" అని అన్నాడే అనుకోండి. "హిహిహి, నేను చూసుకోనేలేదే?" అని ఇకిలిస్తాడు కానీ చాచిన చేతిని మాత్రం వెనక్కు తీసుకోడే. అటువంటి చలమయ్య నాలుగైదేండ్లుగా మాల వేస్తున్నాడు. శబరిమలకు ఎలబారకముందు 'ఓహో' అన్నట్లుగా సంతర్పణ చేసి గానీ మనిషి గడప దాటడే !

వారం రోజుల కొకసారైనా ఒళ్ళు కడుక్కోవడానికి ఓపికలేని ఓబుల్‌రెడ్డి ఇప్పుడు ప్రతి రోజూ మూడో జాము ముగిసిపోకముందే నిద్ర లేస్తున్నాడు. మాల వేసుకొన్నాడు గదా మరి? మూడు మైళ్ళ దూరాన ఉన్న కపిల తీర్థానికి నడుస్తున్నాడు. ఎముకలు కొరికే చలిలో చన్నీళ్ళలో "శరణ మయ్యప్పా ! అయ్యప్ప శరణం !" అంటూ తలమునగ స్నానం చేస్తున్నాడు.

వీళ్ళందర్నీ చూస్తుంటే ఒక పక్క ఆశ్చర్యం. ఇంకొక పక్క ఆలోచన.

నిన్న మొన్నటి వరకూ వీళ్ళందరూ నాతో కలిసి మెలిసి తిరిగినవాళ్ళే. మామూలు మనుషులే. అయినా నోరు తెరిస్తే బండబూతులు కూసే కిష్టుడేనా వీడు? ఆడవాళ్ళ వెంట ఆవురావురుమని పడే మూర్తేనా ఇతను? పిల్లికి బిచ్చం పెట్టని చలమయ్యేనా ఈ సంతర్పణకు కారకుడు? అని నన్ను నేను ఎన్నోసార్లు

ప్రశ్నించుకొంటాను. సందేహమే లేదు. వాళ్ళే వీళ్ళు - వీళ్ళే వాళ్ళు. అయితే ఎంతో నిర్బంధంతో కానీ అలవడని నియమనిష్ఠలు వీళ్ళ కెట్లా అబ్బినాయి? తల్లిదండ్రుల పెంపకంతో కానీ, చదువు సంధ్యలతో కానీ, సజ్జన సాంగత్యంతో కానీ అలవడని ఇంత సంస్కారం మనిషికి ఒక్క మాల వేసుకోవడంతో వచ్చిందంటే... మనిషికి తాను నమ్మిన దేవుడి మీద భక్తి విశ్వాసాలు !

ఆ దేవుడి మహిమలు ఏమిటో కానీ ఒకప్పుడు ఊరంతా గాలించినా మాల వేసుకొన్న స్వాములు నలుగురైదుగురి కి మించి కనబడే వాళ్ళు కాదు. చూస్తూ చూస్తూ ఉండగానే నలుగురికి నలభైమంది అయినారు. ఇప్పుడు నాలుగు వేలకు పైబడినారు. ఒకనాటికి నలభై లక్షలు - కోట్లు కూడా కావచ్చు. అయితే మంచిదే.

ఆ దేవుణ్ణి చూడాలన్న కోర్కె నాలో తీవ్రతరమయింది. అయితే మాల వేసుకోకుండా వెళ్ళగూడ దన్నారు. వెళ్ళితే మాత్రం ఏ పులివాతనో, ఎలుగుబంటి కోరల్లోనో పడడం ఖాయ మన్నారు.

"ఈమధ్య శబరిమలైకు వెళుతున్న బస్సు పెద్ద లోయలో పడిపోయింది కదా? అందులో ఉన్న వారంతా మాల వేసుకొన్న స్వాములే కదా? మరి ఆ స్వాములంతా స్వామిలో కలిసిపోయినారు కదా?" అంటే - "ఏ స్వామో చేసిన చిన్న తప్పు దీనికి కారణమై ఉంటుంది" అన్నారు.

"ఇంతమంది స్వాములు చేసిన మంచి ఒక్క చిన్న తప్పును కాచుకోలేకపోయిందా?" అని వాళ్ళతో వాదిస్తే - వాదులాట మాత్రమే మిగులుతుంది. అందువల్ల నేను మనస్సే మాల గదా? అని ఆలోచిస్తున్నాను.

** ** **

ఆ రోజు చలమయ్య స్వామి ఇంట్లో బ్రహ్మాండమైన సంతర్పణ జరిగింది. ఉదయాన్నుంచి మధ్యాహ్నం వరకు ఆ భక్తబృందం ఎలబారేదాకా శబ్ద ప్రసారయంత్రం అలుపూ సొలుపూ ఎరక్కుండా అయ్యప్ప స్వామి భక్తి గీతాల్ని వినిపిస్తూనే ఉంది. దాని పని దానిదిగా ఉంటే, స్వాము లంతా గుంపు జేరి మధ్యాహ్నం భిక్ష స్వీకరించేవరకు నిర్విరామంగా భజన చేస్తూనే ఉన్నారు. ఆ దారిమీద నడుస్తున్న



వాళ్ళు చలమయ్య ఇంటి ముందర ఒక్క క్షణం ఆగి.. ఇంటివైపు చూసి "శరణ మయ్యప్పా !" అని చేతులెత్తి మొక్కి ఆ తరువాతనే ముందుకు నడుస్తున్నారు. స్వాము లంతా భిక్ష స్వీకరించిన తరువాత తమక్కూడా పిడికెడి మెతుకులు దొరుకుతా యేమో - అన్న ఆశతో కొంతమంది భిక్షగాళ్ళు ఇంటి ముందర నిలబడి భక్తి గీతాల పరవశంలో తన్మయులైనట్లు తల లూపుతున్నారు. ఒకటి, రెండు కుక్కలు అటూ ఇటూ అడ్డదిడ్డంగా తిరుగుతున్నాయి. ఆ కుక్కలు అడ్డం వస్తే కూడా "పక్కకు తొలగండి సామీ" అంటున్నారు వస్తూ పోతున్న స్వాములు.

ఎంత భూతదయో ! అయ్యప్ప స్వామి భక్తులు తాము మంచిగా మారాలన్న దృఢసంకల్పంతో మాల వేసుకొంటున్నారా? లేక మాల వేసుకొన్నందువల్ల మారిపోతున్నారా?

అదే నా తపన.

స్వాము లంతా భిక్ష స్వీకరించడం, ఇరుముళ్ళు కట్టడం, పెద్ద స్వాములకు చిన్న స్వాము లంతా కానుకలు సమర్పించడం అవుతూనే చలమయ్య భక్తబృందం ఎలబారింది.

కొంతమంది స్వాములు బస్సుల్లో వెళతారు. కొంతమంది రైళ్ళలో వెళతారు. ఎవరు ఎటు వెళ్ళినా అందరు పంబానది దగ్గరనుంచి శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధికి తప్పనిసరిగా నాలుగైదు మైళ్ళు నడవవలసిందే.

మామూలు భక్తులైతే పంబానది వరకు బస్సు మీద వెళతారు. అక్కడి నుంచి ఆ నాలుగైదు మైళ్ళు నడుస్తారు. అదే మహాభక్తులైతే ఏరిమలై నుండి ఏకంగా నడవడానికే పూనుకొంటారు. ఏరిమలై నుంచి పంబానదికి నలభై ఒక్క మైలు. అక్కడి నుంచి మామూలు భక్తులైనా, మహాభక్తులైనా ఆ నాలుగైదు మైళ్ళు నడవలసిందే. అంటే స్వామి సన్నిధి చేరుకోవడానికి మామూలు భక్తులు నాలుగైదు మైళ్ళు నడిస్తే మహాభక్తులు నలభై ఆరు మైళ్ళు నడుస్తున్నారన్న మాట.

చలమయ్య వాళ్ళది మహాభక్తబృందం. రైల్లోనే ఎలబారింది. నేనూ వాళ్ళతో కలిసి రై లెక్కాను.

** ** **

అర్థాన్నీ పరమార్థాన్నీ ఎరిగిన భక్తులు - అయ్యప్ప స్వామి మహాభక్తులు ఏరిమలై నుంచి "శరణం అయ్యప్పా ! అయ్యప్పా శరణం !" అంటూ ఆ అడవి మార్గాన్ని పట్టి అవతలీగా నడుస్తున్నారు.

వాళ్ళు ముందు. నేను వాళ్ళ వెనుక. నేను గస పోసుకొంటూ నడవలేక నడుస్తున్నాను.

వాళ్ళు అయ్యప్ప స్మరణతో సునాయాసంగా నడుస్తున్నారు. నాకు అదే ఆశ్చర్యంగా ఉంది.

ఒక్క మండలం. అంటే నలభై రోజులు. ఒంటి పూట భోజనం చేస్తారట. చన్నీటితోనే స్నానమట. కటిక నేలమీదనే నిద్రట. పానమూ, ధూమపానమూ అసలు జోలికే రాకూడదట. ఇట్లాంటి కఠోరమైన నియమాలతో శుష్కించిన దేహాలయినా ఎంతో సునాయాసంగా నడుస్తున్నారు. మూడు పూటలు సుష్టుగా మెక్కుతున్నా నేను గసపోసుకుంటూ అవస్థ పడుతున్నాను.

కాకులు దూరని కారడవి అంటారే - అంత దట్టంగా ఉంది ఆ అడవి. పది బారల కవతల మనిషి కండ్లు చించుకొని చూసినా కనిపించడు. అంత దట్టమైన అడవిలో కాలి బాట. ఆ బాట మీద భక్తబృందం.

రెండు రోజులుగా వాళ్ళ వెంట పడి నడుస్తున్నాను.

ఇద్దరు చెరొకవైపు నిలబడి చేతులు బారసాచి కౌగలించుకుందా మన్నా వీలుపడనంత లావుగా టేకు, మద్ది, విప్ప, దిరిసెన, కుంకుడు వృక్షాలు ఆకాశంలోకి చొచ్చుకొని పోతున్నట్లున్నాయి. వాటిమీద ఒక చెట్టు మీదనుంచి ఇంకొక చెట్టుమీదికి అవలీలగా దూకుతున్న ముచ్చుకోతులు. అవి అట్లా దూకుతూ కిచకిచ అరుస్తూంటే భయపడి పైకెగిరిపోతున్న రకరకాల పక్షులు చూడముచ్చట గొలుపుతున్నాయి. పైకి చూడలేము. చూడకుండా ఉండలేము. చూస్తే ఆ కాలి దోవలో ఏ రాతికైనా కాలు తగిలిందంటే అక్కడే అయ్యప్ప సాక్షాత్కారం జరిగేటట్టుగా ఉంది.

కొండెక్కుతూ ఉంటే ఏ క్షణాన గుండె లాగిపోతా యో అన్నట్లుగా గస. ధారాపాతంగా కారుతున్న చెమట. అప్పుడప్పుడు ఎందు కీ అనవసరమైన ప్రయాస - అన్న సంశయం. అయినా ఈ జనారణ్యాన్ని వదిలిపెట్టి అసలైన ఈ అరణ్యంలో నడుస్తూంటే - అలనాటి సీతా రాముడి నుంచి మొన్నటి అల్లూరి సీతారామరాజు వరకు మనస్సులో మెదులుతున్నారు. ఒక రకమైన అనుభూతి శరీరా న్నావరించింది. అది భయమా? కాదు. భక్తి? దాని మీద నమ్మకం లేదు. పోనీ ఆనందం అనుకొందామా అంటే - అవునో, కాదో - అన్న సందేహం. మొత్తానికి అది మాటల కందని ఒక విచిత్రమైన స్థితి.

అయ్యప్ప స్వామి భక్తులు పరవశించి పాడుతున్న పాటలు. ఆలకిస్తూ తల లూపుతున్నట్లున్న పెద్ద పెద్ద వృక్షాలు. వాటి ఆధారంతో అల్లుకున్న దట్టమైన పొదలు. ఆ పొదల్లో పురులు విప్పి ఆడుతున్న నెమళ్ళు. చిత్ర విచిత్రంగా అరుస్తూ ఎగురుతున్న పక్షులు. ఇంతమంచి వాతావరణానికి అంతరాయం కలిగిస్తున్నట్లుగా ఎక్కడో వన్యమృగాల అరుపులు. ఆ వన్యమృగాల్ని బెదరగొట్టడానికి ఆలయాధికారులు నియమించిన సిబ్బంది అప్పుడప్పుడు కాలుస్తున్న టపాసుల శబ్దాలు.

శోభాయమానమైన ఈ ప్రకృతి వొడిలో ఈ అరుపు లెందుకు? ఈ ఆర్భాటా లెందుకు? ఇవన్నీ లేకుండా ఉంటే ఎంత ప్రశాంతంగా ఉండేదో? ఈ క్రూరమృగాలు, విషసర్పాల బెడద లేకుండా ఉంటే ఈ అడవుల్లో మనిషికి ఎంత స్వేచ్ఛ, ఎంత ఆనందం - అని ఆలోచిస్తూ ఉంటే ఈ అడవుల్లో వీటన్నిటినీ సృష్టించి సృష్టికర్త పొరబాటు చెయ్యలేదు కదా - అన్న సందేహం కలుగుతూ ఉంది. కానీ అంతలోనే స్వేచ్ఛ మనిషి స్వార్థానికి దారితీస్తుంది కదా? ఈ అడవుల్లో స్వేచ్ఛ లభించి ఉంటే మనిషి నిజంగా స్వార్థు డయ్యేవాడు. మనిషి స్వార్థం ముందు ఈ అడవులు బతుకుతా యా? బహుశా ఈ అడవుల పరిరక్షణ కోసరమే సృష్టికర్త ఈ క్రూరమృగాల్ని 'విషసర్పాల్ని అడవుల్లో సృష్టించినట్లుంది.

క్రూరమృగాలు, విషసర్పాలు అడవుల్ని రక్షిస్తూ ఉంటే అడవులు వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతున్నాయి. లేకుంటే మానవ మనుగడ దుర్లభమయ్యేదేమో?

ఈ సృష్టిలో ఇంత రహస్యం ఇమిడి ఉందా?

ప్రతి రోజూ ఎప్పుడో ఒకప్పుడు ఎంతో కొంతసేపు నేను మా మేడమీద నిలబడుతుంటాను. అట్లా నిలబడి చూస్తుంటే ఉత్తరంగా శేషాచలాలు కనిపిస్తుంటాయి. ఆ కొండల్లోనే సృష్టికర్త నెలకొని ఉన్నాడని వేలాదిమంది ఆ కొండల్ని ఎక్కుతూ

## ఏమవుతుంది ?

ఒక టీచర్ పిల్లలకు తీసివేతలు చెబుతూ ఒ కమ్మాయిని ఇలా అడిగాడు.

"నీ చేతికి పది వేళ్ళున్నవి. అందులో మూడు లేవనుకో. అప్పు డేమవుతుంది?"


"సంగీతం పాఠాలు ఉండవు."

## అభిరుచి

రాము: నీవు చిత్రకారుడివి కదా! నీ భార్యకి కూడా దానిలో ఏదైనా అభిరుచి ఉందా?

సోము: ఆఁ, ఉంది. పులుసులు వగైరాలకు రుచి లేకపోయినా రంగు వేస్తే చాలు అంటుంది.

పి.ఆర్. బద్దిగం



కనిపిస్తుంటారు. అయితే ఆ కొండల్ని గురించి నేనెప్పుడూ ఈ విధంగా ఆలోచించనేలేదు. అనుభవంతో ఆలోచన మెరుగవుతుందంటారు. అంటే ఇదేనేమో?

జనారణ్యాల్లో జనులు ఈ అరణ్యాల్ని గురించి కనీసం అయిదు నిముషాలు ఆలోచించగలిగితే ఈ దారుణ పరిస్థితులు మనకు ఎదురయ్యేవేనా? ఈ కరువుకాటకాలతో లోకం ఇట్లా నలిగిపొయ్యేదేనా?

మనిషికీ, అడవికీ మధ్య - అడవికీ, మృగానికీ మధ్య - మనిషికీ, మృగానికీ మధ్య అంతర్లీనంగా ఉండే సృష్టి రహస్యం ఎంత అద్భుతం? ఎంత ఊహాతీతం?

వాళ్ళు భక్త్యావేశంలో వాళ్ళు. నా ఆలోచనల్లో నేను.

వాళ్ళు ముందు, నేను వెనుక. ఆ అడవి దారిమీద శబరిమలై చేరుకోవడానికి ఆ ముందటి రోజునుంచి నడుస్తున్నాం.

అంతవరకు మాతో కలిసి నడిచిన సూర్యుడు కూడా ఆ పూటకు గూడు చేరుకోవాలన్నట్లుగా తొందర పడుతున్నాడు.

అయ్యప్ప భక్తబృందం కూడా ఆ రాత్రి మజిలీకి అనువైన చోటు కోసరం పరిసరాల్ని గమనిస్తూనే నడుస్తున్నారు.

** ** **

జనారణ్యాన్ని అంతవరకూ తన శతకోటి కరకిరణాల్తో సతమతం చేసిన సూర్యుడు ఆ అరణ్యంలో నిస్సహాయుడై చేతులు ముడుచుకొన్నట్లు కొండ కొనకొమ్మున కూర్చొబోతున్నాడు.

ఆత్రగాడి బుద్ధిలా వ్యాపించిన ఆ చెట్టు కింద గుడారంలో పాశ్చాత్య సంగీతం. ఉరవళ్ళు పరవళ్ళమీద ఉంది. ఆ మహారణ్యంలో పాశ్చాత్య సంగీతమా? అంటే - క్రిస్మస్ పండుగ రోజులు కదా, ఎవరో కొంతమంది క్రైస్తవులు ప్రకృతి ఒడిలో పండుగ చేసుకోవడానికి వచ్చినట్లుంది. ఆ కీకారణ్యంలో చెట్టూ చేమా లేకుండా ఉన్న ఆ ప్రదేశం గుబురుగా వెంట్రుకలున్న తలలో ఎక్కడో ఒక చోట పేను కొరికినట్లుంది. ఆ ప్రదేశంలో సెలయేళ్ళు గలగలా ప్రవహిస్తున్నాయి. ఆ సెలయేళ్ళన్నీ కలిసి మాట్లాడుకొన్నట్లుగా ఆ మైదానంలో ఒక చోట కలుస్తూంటే అక్కడొక కొలను ఏర్పడింది. ఆ ప్రదేశాన్ని రక్షించడానికి నియమితులైన రక్షకభటుల్లా చుట్టూ పెద్ద పెద్దచెట్లు ఏపుగా పెరిగి విస్తరించి ఉన్నాయి. అన్నింటికి అనువుగా ఉంటుందని ఆ క్రైస్తవ [illegible]ం అక్కడ చేరినారు. ఒకానొక చెట్టు కింద ఒక గుడారాన్ని వేసుకొని బస ఏర్పాటు చేసుకొన్నారు.

రావడం అడవుల్లోకి. వచ్చింది పండుగ చేసుకోవడానికి. అక్కడే కాపురం పెట్టడానికా - అన్నట్లు కావలసిన సరంజామా అంతా సమకూర్చుకొని తెచ్చుకొన్నట్లుంది. ఆ చెట్టును, చెట్టుకింద గుడారాన్ని రంగు. రంగుల విద్యుద్దీపాలతో అలంకరించినారు. ఆ మైదానంలో సెలయేళ్ళ ఉరవళ్ళ పరవళ్ళు ప్రకృతి కాంత కాలి మువ్వడ ల సవ్వడుల్ని తలపింపచేస్తున్నాయి. వెలుగుతూ మలుగుతూ ఉన్న విద్యుద్దీపాలు ప్రకృతి కాంత చిలిపి చూపులా - అనిపిస్తున్నాయి. ప్రకృతి నాట్యమయూరి విన్యాసమే పాశ్చాత్య



సంగీతంగా ఉంది.

పగలంతా ఆ అడవుల్లో తిరిగి వేటాడి కుందేళ్ళను, లేళ్ళను చంపి తెచ్చుకొన్నారు. మాంసం, మధువు, మగువ - మనిషిని మైమరిపించడానికి ఇంతకంటే కావలసిందేముంది?

కీచురాళ్ళ రొదలు, వన్యమృగాల అరుపులు - గాలి విసుర్లకే అలవాటు పడిన అడవిలో సంధ్య ఆ పూట శోభాయమానంగా ఉంది.

ఆ మైదానానికి ఆవలివైపు కొన్ని గుడిసెలు. ఆ గుడిసెల్లో కూలి బతుకులు. కొందరు కొలను గట్టున నిలబడి గుడారంవైపు దేబెరించి చూస్తున్నారు. గుడిసెలు దేబెరించి చూస్తున్నాయని గుడారం మంచి ఊపు నందుకొనింది.

ఆ రాత్రికి ఆ మైదానంలోని ఒక చెట్టు కింద విడిది చేయడానికి నిర్ణయించుకొనింది అయ్యప్పస్వామి భక్తబృందం కూడా. వాళ్ళతో కలిసి నేనూ.

ఆ బృందంలో ఇద్దరు, ముగ్గురు పెద్ద స్వాములున్నారు. తక్కిన వాళ్ళందరూ చిన్న స్వాములే.


వరసగా మూడేండ్లు మాల వేసుకొంటే పెద్ద స్వాములయ్యే అర్హత కలుగుతుందట. ఆ పెద్ద స్వాములు చెట్టుకింద కూర్చున్నారు. వాళ్ళతో కలిసి కూర్చొని కొంతమంది చిన్న స్వాములు "చేదుకో అయ్యప్పా ! మమ్మాదుకో అయ్యప్పా ! శరణం శరణం అయ్యప్పా ! స్వామీ శరణం అయ్యప్పా ! స్వామియే శరణం అయ్యప్పా !" అని భజనలు చేస్తున్నారు. మరి కొంతమంది చిన్న స్వాములు ఆ రాత్రికి ఫలహారం చేసే ప్రయత్నంలో పడినారు. మరి కొంతమంది ఆ రాత్రికి నెగళ్ళు వేసుకోవడానికి కట్టే, కంపా కూడవెయ్యడానికి తారాడుతున్నారు.

రెండు రోజులుగా అడవుల మీద పడి నడుస్తున్నా నేను నా తిండి తిప్పల్ని గురించి ఆలోచించవలసిన అవసరమే లేకుండాపోయింది. ఆ దారి మీద నడుస్తున్న ఏ భక్తబృందం అయినా సరే, వాళ్ళు భిక్ష స్వీకరిస్తున్న సమయంలో వాళ్ళ కంట పడ్తే చాలు - "రండి స్వామీ" అని ఎంతో మర్యాదగా పిలిచి అతిథి సత్కారాలు చేస్తున్నారు. అందువల్ల నన్ను గురించి నేను ఆలోచించుకోవలసిన అవసరమే లేకుండాపోయింది. ఆ రాత్రి నాకు లక్షణంగా ఫలహారం దొరుకుతుందని తెలుసు.

ఏ పని చేసినా మనిషి అంత తిండికోసరమే చేస్తున్నాడు. ఏ పని చేయకుండా అంత తిండి దొరుకుతూ ఉంది. తిని కూర్చోవచ్చు గదా. కూర్చోలేడే. అదే మనిషి స్వభావం. నేనూ మనిషినే.

ఆ మైదానంలో కొలను. ఆ కొలనుకు ఆవలిగట్టున అల్లంత దూరంలో పది, పన్నెండు గుడిసెలు. ఆ గుడిసెల్లో కూలి జనం. ఆ కొలనుకు ఇవతలి గట్టున పెద్ద చెట్టు. ఆ చెట్టు కింద అందాల గుడారం - నా దృష్టిని ఆకర్షించినాయి. మా స్వాములంతా తమ తమ పనుల్లో తాము నిమగ్నులై ఉన్నారు. నేను మాత్రం మెల్లగా ఆ గుడారం వైపు నడిచాను. అయిదారు నిముషాల్లోనే నే నక్కడికి చేరుకొన్నాను. ఆ గుడారం ముంది నిలబడినాను.

ఆడా మగా తేడా లేకుండా ఆ గుడారంలో అందరూ కలిసి కూర్చున్నారు. దాదాపు ఏడాది



పొడుగునా వర్షాలు పడుతున్న ప్రాంతం. నేల చిత్తడిగా ఉంది. అసలే అరణ్యం. అందులో సాయంకాలం. ఈదురుగాలి. చలిచలిగా ఉంటే వాళ్ళందరు వెచ్చని ద్రవాల్ని సేవిస్తున్నారు. కొందరు పాడుతున్నారు. కొందరు వాయిద్యాలతో సహకరిస్తున్నారు. ఆ పాటకు తగినట్లుగా కొందరు నృత్యం చేస్తున్నారు. వాళ్ళ ఆనందంలో వాళ్ళున్నారు.

నే నా గుడారం ముందు నిలబడేసరికి వాళ్ళందరి దృష్టి నా మీద పడింది. వాళ్ళందరూ నన్ను వింతగా చూస్తున్నట్లు వాళ్ళ చూపులే చెప్తున్నాయ్. బహుశా ఆ దారిమీద నడుస్తూ వాళ్ళ కంటపడిన తెల్లగుడ్డల వ్యక్తి నే నొక్కణ్ణే కావడం కారణం కావచ్చు.

వాళ్ళు సాధారణ స్థితిలో ఉంటే పరిస్థితి ఎట్లా ఉండేదో ఏమో. కానీ - హుషారు మీద ఉన్నారు కదా? ఆనందాన్ని పంచి ఇవ్వాలన్న సహృదయత ఎవరికైనా అటువంటి సందర్భాల్లో కలిగేటట్లుంది. అందుకేనేమో? న న్నెంతో ఆప్యాయంగా ఆహ్వానించినారు.

ఫోటో : కళ్యాణ్ వెంకట్ [తెనాలి]



వాళ్ళ ఆహ్వానానికి కృతజ్ఞతగా రెండు చేతులు జోడించాను. వాళ్ళు పడీ పడి నవ్వుతున్నారు.

"చేతి కందుతున్న ఇంత గొప్ప ఆనందాన్ని చేజేతులా జారవిడుచుకునే వెర్రివాళ్ళెవరైనా ఉంటారా?" అని దెప్పి పొడిచినట్లుం దా నవ్వు.

అక్కడే నిలబడితే ఆ నవ్వులు మరింత ఎక్కువ కావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ అవకాశం కల్పించడం ఎందుకులే - అనుకొంటూ అటు తిరిగినాను.

కొలను కావలి గట్టున గుడిసెల్లో ఏడుపులు. కూలి జనం హడావిడిగా అటు ఇటు పరుగెత్తుతున్నారు.

అంతవరకూ కొలను గట్టున నిలబడి గుడారం వైపే దేబెరించి చూస్తున్న పిల్లలు, పెద్దలు కూడా గబగబా గుడిసెలవైపు పరుగెత్తుతున్నారు.

నేను కూడా గబగబా ఆ గుడిసెల వైపు నడిచినాను.

చెరొక భుజాన్ని ఆసరాగా ఇచ్చి ఒక వ్యక్తిని ఇద్దరు చేతుల మోపున తెస్తున్నారు. వాళ్ళ వెంబడి ఒక స్త్రీ వెక్కి వెక్కి ఏడుస్తూ వస్తూ ఉంది. దాదాపు ఆ గుడిసెల్లో ఉన్న ముప్పై, నలభై మంది అతని చుట్టూ గుంపు చేరినారు. ఆ గుంపుకు ఎదురుగా వెళ్ళిన వాళ్ళను కలుసుకొన్నాను.

"ఏమయిం దతనికి?" ముక్కుతూ మూలుగుతూ చేతుల బలపంతంమీద నడుస్తున్న ఆ వ్యక్తిని చూస్తూ అడిగినాను.

వాళ్ళందరూ గచ్చకాయల కుండలో చెయ్యి బెట్టి కలబెట్టినట్టు గలగల మాట్లాడుకొంటున్నారు. అరవం, తెలుగు, ఉరుదూ - అన్ని భాషలూ వినిపిస్తున్నాయి. అందులో ఒకడికి నా మాట చెవిని పడినట్లుంది.

"వాడు చెట్టుమీద నుంచి కాలు జారిపడ్డాడు."

"అయ్యో పాపం ! అయితే మీ రందరూ ఇక్కడేం చేస్తుంటారు?"

"కూలి పని."

"ఈ అడవుల్లో కూలి పనులా? ఏం పను లుంటాయబ్బా ఇక్కడ?"

అంతలోనే ఎవరో పిల్చినట్టుంది. నా మాట పట్టించుకోకుండా అతను వెళ్ళిపోయినాడు. పాపం, వాళ్ళ హడావిడిలో వాళ్ళున్నారు. నలుగురు అతన్ని జాగ్రత్తగా పట్టుకొని గుడిసెలోకి చేర్చే ప్రయత్నంలో ఉన్నారు. వాళ్ళ వెనక పక్క ఏడుస్తూ వస్తున్న ఆడమనిషి గబగబా గుడిసెలోకి దూరింది. బహుశా పడక వెయ్యడానికై ఉంటుంది. తన పిచ్చి గానీ అక్కడేం పట్టుపాన్పు లున్నాయా పరచడానికి ! తప్పకుండా ఒక చినిగిన చాప ఉంటుంది. అంతకన్నా చినిగిన పాత పేలిక లుంటాయ్. వాటితోనే పడక వేసి ఉంటుంది. బతుకు పేదదైనా గుండె పేద కాదు గదా?

అతన్ని చేతులమీదుగా మోసుకొని గుడిసెలోపలికి వెళ్ళిన నలుగురు కాసేపట్లో బయటికి వచ్చినారు - ఆ ఇల్లాలు అమర్చిన పడకమీద అతన్ని పడుకోబెట్టి.

"ఎ(వికలు గి(విక లే(వీ యిరగలేదు. అంత కాడికి మేలే. వొళ్ళు మాత్రం బాగా అదిరిపొయ్యుంటుంది. అంతెత్తునుండి పడ్డే అదర్లా? వొరే జాన్, నువ్వు పొయ్ గుడిసె గుడిసెలో పిడికి డుప్పు అందుకొని రారా ! ఉప్పు ఏయించి కాపడం యేస్తే సరిపోతుంది !" అని ఒకడు పురమాయిస్తున్నాడు.

"ఉప్పు కాపడం మంచిదే. కాని గెచ్చకాకు దెచ్చి దంచి పసరు పిండి బాగా వొళ్ళంతా పట్టించేసి మల్లా కావాలంటే ఉప్పుతో కాపడం యేస్తే తెల్లారేకాడికి లేసి తిరగత డు." ఇంకొకడు తనకు తెలిసిన వైద్యం చెప్తున్నాడు.

"వీటికంటే ఎర్రమట్టి పట్టేసి చింతాకు, ఊడగాకు ఎచ్చపెట్టి కాపడం బెట్టే ఇంకా తొందరగా తెప్పరుకుంటాడు." మరొకడు సలహా ఇస్తున్నాడు.

అవును మరి? ఆ మహారణ్యంలో ఆసుపత్రు లున్నాయా? అశ్వినీదేవత లున్నారా? వాళ్ళలో వాళ్ళే వైద్యులు.

వాళ్ళలో ఒక్కడికి దెబ్బ తగిలింది. అయినా అందరూ ఆ దెబ్బ తమకే తగిలినట్లు భావిస్తున్నారు. బాధ పడుతున్నారు. అదే నాగరిక సమాజంలో అయితే? కండ్లెదుటే జరుగుతున్నా తమ కేమీ భట్టనట్టుగా తల పక్కకు తిప్పుకొని పోతుంటారు. వాళ్ళెక్కడ? వీళ్ళెక్కడ? అదే ఆలోచిస్తూ నిలబడుకొన్నాను.

"ఏం కావాలి సామీ?" ఒక వయసు మళ్ళిన వ్యక్తి నా ఎదుట నిలబడి అడుగుతున్నాడు.

"నా కేం అవసరం లేదయ్యా ! మేము శబరిమలై యాత్రలో ఉన్నాం. మా స్వాములంత ఈ రాత్రికి ఇక్కడే బస చేస్తూంటే..."

ఆ మనిషి నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు - బహుశా శబరిమలై యాత్రలో ఇదేం వేష మన్నట్లుగా.

"మా స్వాములంత రాత్రి ఫలహారానికి ఏర్పాట్లు చూస్తున్నారు. ఇక్క డేదో ఏడుపులు, రంపులు - వినిపిస్తే !" నా నోట్లో మాట నోట్లో ఉండగానే - "అవును సామీ ! వాడి పేరు అజీజ్. చెట్టెక్కి కుంకుడుకాయలు రాలస్తా ఉణ్ణాడు. పొద్దుపోత వుంటే అదరబాదరా దిగబోయ్ కాలుజారి పణ్ణాడు."

"అయితే యిదేనా మీ రిక్కడ చేస్తున్న పని?"

"ఇ దొగిటే గాదు. తూనికాకు కోస్తుంటాం. కరక్కాయిలు, కుంకుడుకాయిలు, తుమ్మబంక."

"ఇవన్నీ ఈ అడవుల్లో సేకరించి తీసుకొనిపోయి టౌన్లల్లో అమ్ముకుంటారా?"

"అమ్మో ! అంత పన్జేస్తే యింక బతకనిస్తారా?"

అతని కండ్లల్లో భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉంది.

"మరి?"

"మా కాంటాక్టర్ రాంసింగ్. ఆయిన ఈ అడివిని యిజారా ఎత్తినాడు. మే(పంత అయిన్దగ్గిర పన్జేస్తాం. ఈ అడివిలో కుంకుడుకాయిలు, కరక్కాయిలు, తుమ్మబంక, తూనికాకు మే(పు పొద్దుగూకులూ పోగుజేస్తే ఆయిన అమ్ముకుంటాడు. మాకు దిన కూలీ లిస్తాడు."

అది కాకులు దూరని కారడవి. కాకులు దూరకపోతే మాత్రం ఏం? ఏనుగుల్ని మింగేవాడికి పీనుగులు పిండాకూడన్నట్లు గ్రహాంతరాలకు వెళ్ళే మనిషిని గుహలేం చేస్తాయి? ఆ ఎముకల గూళ్ళు గ్రహాంతరాలకు వెళ్ళగలిగిన శక్తి సంపన్నులు కారు. అసలు

నంపన్నులే కారు. అందుకే కడుపులు చేత బట్టుకొని పెండ్లాం పిల్లల్తో ఆ అడవుల్లో కాపురం చేస్తున్నారు. పిడికెడు కూటికి మనిషి పడుతున్న పలుబాట్లకు వీళ్ళ జీవితాలు ప్రతిబింబాలు !

అడవుల్లో బతుకులు గదా? ఏ వేళకు ఎట్లుంటుందో? ఆ పూట అజీజ్ కాలు జారి పడినాడు. మరొక రోజు అదేగతి జాన్సన్‌కు పట్టవచ్చు. ఇంకొకణ్ణి పాము కాటేయవచ్చు. ఎవరికేమి జరిగినా అది తమకే జరిగినట్టు, ఆ బాధంతా తమదే అయినట్టు, కడుపులు చేత పట్టుకొన్నా ఆ కారడవిలో మమకారానికి లోటులేని బతుకులు బతుకుతున్నారు.




అది సహజీవనం. ఉండి తిన్నా లేకుండా పస్తులున్నా కానల్లో కాపురాలైనా వాళ్ళు కష్టసుఖాల్ని పంచుకోవడం ఎంత ఆదర్శప్రాయంగా ఉంది !

అదే ఆలోచించుకొంటూ అక్కడ నుంచి బయల్దేరినాను. నాతో నిమిత్తమే లేనట్లుగా నా చూపులు మళ్ళీ ఆ గుడారం వైపు మళ్ళినాయి.

ఆ గుడారం ముందు పది, పన్నెండు మంది కూలీ జనం నిలబడుకొని ఉన్నారు.

"పావం ! ఆపదలో ఉన్నారు కదా? ఏం అవసరం వచ్చిందో ఏమో. నిషా హుషారులో ఉన్న ఆ గుడారం వీళ్ళ గోడును చెవుల్లో వేసుకొంటుందా? ఏదైనా అవసరం ఉంటే చేతనైన సహాయం చేయవచ్చు గదా?" అని ఆలోచిస్తూ ఆ గుడారం దగ్గరకు నడిచినాను.

"పొద్దు గూట్లో వడ్తా వుండాది. మేం నమాజ్ చేసుకోవాల." నాలుగైదు గొంతులు కలిసి ఈ ఒక్క మాటనే నొక్కి పలికినాయి. అయినా ఆ మాట గాలిలో కలిసిపోయింది.

"మిమ్మల్నే మేం నమాజ్ చేసుకోవాలి."

అవే గొంతులు ఈ మాటను రెట్టించి పలికినాయి. ఆ అరుపుతో గుడారం అదిరిపడింది. అక్కడ ఎత్తిపోతల మీద ఉన్న సంగీతం ఆగింది. "ఏం కావాలి మీకు?" అన్నట్లుగా వాళ్ళందరూ కూలీ జనం వైపు చూస్తున్నారు.

"మా నమాజ్‌కు వేళయింది."

"అయితే చేసుకోండి."

"మీ రంపు కొంచెంసేపు నిలపండి."

"రంపా?"

విరగబడి నవ్వుతూ ఉంది గుడారం.

"ఎందు కట్లా నవ్వుతున్నారే?"

"పందులకేం తెలుసు పన్నీరు వాసన !"

ఆ శబ్దం చెవిని పడడంతో ముస్లింలకు ఒళ్ళు మండింది. కాళ్ళు తడబడుతున్నాయ్. "ఏం కుస్తున్నార్రా బేవ్‌కూఫ్‌కే బేటా" అంటూ పన్నెండు రెండ్లు ఇరవై నాలుగు చేతులు పైకి లేచినాయి. గుడారమూ పైకి లేచింది.

ఇరు వర్గాల మధ్యా నేను నిలబడి ఉన్నాను. ఏమి చేయడానికి పాలుపోవడంలేదు.

"మీరు నమాజ్ చేసుకోవాలంటే చేసుకోండి. మే మేమన్నా వద్దన్నామా, అడ్డం పడుతున్నామా?"

"మీరు కాదు అడ్డం. మీరు చేస్తున్న రంపు."

"అదే వద్దనేది. రంపు గింపంటే బాగుండదు."

"బాగుండకపోతే ఏం జేస్తారేం?"

"చేసేది, చెయ్యంది తరువాత. మాది మాత్రం రంపంటున్నారే, మరి ఆ చెట్టు కింద నల్లజీవాలు గొంతు కోసిన మేకల్లాగా అరుస్తున్నారే? అది రంపు గాదా?"

"వాళ్ళకూ్కాడా చెప్తాం !"

"వాళ్ళను ముందు నిలవమనండి. తరువాత కావాలంటే చూద్దాం."

మాటకు మాటగా పెరుగుతూ ఉంటే - "ఏదో ముచ్చట పడి ఒక్క పూట ఈ అడివిలో కొచ్చినారు. వాళ్ళ ఆనందం వాళ్ళది. పోనీలే భయ్యా, ఈ ఒక్క పూట నమాజ్ చేసుకోకపోతే ఫరవాలేదులే భయ్యా."

ఉన్నట్లుండి అక్కడ చెలరేగిన వాగ్వివాదంతో గుడిసెల్లో ఉన్న కూలి జనం క్షణాల్లో అక్కడికి చేరుకొన్నారు. వాళ్ళలో క్రైస్తవులు క్రైస్తవులకు మద్దతుగా నిలబడి ఈ మాట అన్నారు.

"ఒక పూటో, అరపూటో - నమాజ్ చేసుకోకపోతే అల్లా కెవురు బదులు చెప్తార్రా? మీ అబ్బ లొచ్చి చెప్తారా? మీ తాత లొచ్చి చెప్తారా?"

"ఎదురుగా మేఁ వుంటే మా అబ్బలు తాతల్దాకా ఎందుకు? ఆ చెప్పేదేదో మేఁవే చెప్తాం."

"ఏందిరా మీరు చెప్పేది?"

అంతవరకు ఆ అడవిలో ఎంతో అన్యోన్యంగా బతుకుతున్న మహమ్మదీయులు, క్రైస్తవులు వాదులాటకు దిగితే గుడారంలోని క్రైస్తవులు వేడుక చూస్తున్నారు.

అంతలోనే కొంతమంది మహమ్మదీయులు మా స్వాములు బస చేస్తున్న చెట్టు దగ్గరికి పరుగెత్తినారు. అక్క డేమవుతుందేమో, ఏమో - అని వాళ్ళ వెంట నేనూ పరుగెత్తినాను.

"మా నమాజ్‌కు వేళయిపోతూ ఉంది. మీ రంపు కొంచెంసేపు నిలపండి." ఒక ముస్లిం మా స్వాముల్ని ఉద్దేశించి అడిగినాడు.

"అరె భయ్యా, నమాజ్ అంటే మీ ప్రార్థన. ఈ రంపు మా ప్రార్థన. ప్రార్థన చేసుకోవడంలో ఎవరి పద్ధతులు వాళ్ళవి. ఒకరి పద్ధతిని ఇంకొకరు ఎగతాళి చెయ్యడం అల్లా కూడా సహించడు. ఎవరెవరి పద్ధతుల్తో వాళ్ళు ప్రార్థన చేసుకుందాం. ఇందులో మేము నిలిపేది మీరు చేసుకొనేది. మీరు నిలిపేది మేము చేసుకొనేది అన్న ప్రశ్నకు తావే లేదు."

ఒక పెద్ద స్వామి చాలా తెలివిగా మాట్లాడినట్లు భుజాలు ఎగరేసినాడు.

"మేఁవు గొంతు కోసిన మేకల్లాగా అరిచి గీ పెట్టం."


"మేకల్ని గొంతులు కోసేది మేం గాదు. మీరు."

"అయితే మీ రిప్పుడు మేకలు. మీ గొంతులు కోస్తాంరా బేటా." ముస్లింలు తిరగబడినారు.

ఈ మాట కూలి జనంలో ఉన్న హిందువుల చెవిన పడేసరికి వాళ్ళ అరికాలి మంట ఉచ్చి కెక్కింది.

"ఎట్లా కోస్తారో కొయ్యండి చూద్దాం" అంటూ వాళ్ళు హిందువుల పక్షాన నిలబడి మహమ్మదీయుల మీద తిరగబడినారు.

అప్పటివరకూ వాళ్ళలో వాళ్ళకు ఎవరి కెటువంటి కష్టం కలిగినా అది తమ కష్టంగానే భావించి ఏక కుటుంబీకుల్లాగా ఒకరి కష్టాన్ని ఒకరు పంచుకొంటూ సహజీవనం చేస్తూ ఉండిన



సంగతే మరిచిపోయ్‌నారు. క్రైస్తవులు క్రైస్తవుల పక్షాన హిందువు హిందువుల పక్షాన చేరిపోయేసరికి, ముస్లింలు మాత్రం వెలివేసినట్లు నిలబడిపోయ్‌నారు. అయినా వాళ్ళ పట్టు నడలలేదు. చూస్తూ చూస్తూ ఉండగానే మాటకు మాటగా పెరిగి అనుకోని విధంగా అక్కడ కలిసిన మనుషులు మూడు వర్గాలుగా చీలిపోయ్‌నారు.

విహారార్థం వచ్చిన క్రైస్తవులు.

శబరిమలై యాత్రలో హిందువులు -

ఈ అడవిని నమ్ముకొని కడుపు చేత పట్టుకొన్న కూలి జనం - నిజమైన అడవి మనుషులుగా నిలబడినారు.

క్రైస్తవుల చేతుల్లో తుపాకు లున్నాయ్.

మండుతున్న నెగళ్ళలో నుంచి కొరివికట్టెల్ని చేత బట్టుకొని హిందువులు కొరవిదయ్యాల్లా కనిపిస్తున్నారు.

గడ్డపారలు, కర్రలు చేత బట్టుకొని ముస్లింలు ముంగాళ్ళ మీద ఉన్నారు.

ఏ క్షణాన ఎవ్వరి చెయ్యి పైకి లేస్తుందో? పైకి లేచిన చేతిని పడగొట్టడానికి మరే చెయ్యి తలపడుతుందో? చెయ్యి చెయ్యి కలిస్తే అక్కడెంత రక్తపాతం జరుగుతుందో? అని ఊహించేకొద్దికీ ఒళ్ళు జలదరిస్తూ ఉంది. అయినా ఏం చెయ్యాలో తోచడంలేదు. ఒకరికి మించి ఇంకొకరుగా ఆవేశపడుతున్నారు. చెప్తే చెవుల్లో వేసుకొనే స్థితి ఎప్పుడో దాటిపోయింది. పరిస్థితి చెయ్యి దాటిపోతున్నదే - అని ఎంత తపించినా తరుణోపాయం కనిపించడంలేదు. పోనీ ఆడవాళ్ళతో అయినా చెప్పి వాళ్ళనైనా అడ్డ పెట్టుకుందామంటే వాళ్ళు అంతకంటే ఆవేశపడుతున్నారు.

అమాయకులైన చిన్నపిల్లలు మాత్రం అందరూ ఒకటై ఏడుస్తున్నారు. ఆ ఏడుపు వాళ్ళ చెవి కెక్కేటట్లుగా లేదు.

దేవుణ్ణి చూడాలని బయల్దేరి కడకు రక్తపాతాన్ని కండ్ల చూసే పరిస్థితి దాపురించిందే - అని మనను వరి వరి విధాలా పోతూ ఉంది. అయినా చేసేదేముంది?

కాలు గాలిన పిల్లిలా అటు ఇటు తిరుగుతూ చేతులు పిసుక్కోవడం కంటే మార్గాంతరం తోచడంలేదు. ఎందరో మహర్షులకు మనశ్శాంతిని ప్రసాదించిన ఆ అడవి రక్తాన్ని చవిచూడవలసి వస్తుందన్న భయంతోనేనేమో కండ్లు మూసుకొనింది.

కనుచీకటి ఆవరించింది.

ఆ క్షణంలో అందరి గుండె జల్లుమనింది. కోపంతో కుంపటులైన కండ్లలో భయం చోటు చేసుకొనింది. నిప్పులు కురిపిస్తున్న చూపులు నిలకడలేకుండా అటూ ఇటూ పరుగులు తీస్తున్నాయ్.

ఎక్కడో పొదల మాటున ఉరుము ఉరిమినట్లుగా గాండ్రించిన పెద్దపులి వాళ్ళ కండ్ల పడలేదు. గాండ్రింత మాత్రం గుండెల్ని అదరగొట్టింది.

అంతే ! అంతవరకు మూడు వర్గాలుగా చీలి కయ్యానికి కాలు దువ్వుతున్నవాళ్ళు వాళ్ళకు తెలియకుండానే అందరూ ఒకటై దిమ్మి కట్టినారు. పులిని బెదరగొట్టడానికి హాహాకారాలు చేస్తున్నారు. క్రైస్తవుల చేతుల్లో తుపాకులు గాలిలో పేలినాయి.

పైటకొంగులు ఊడ్చి నడుమున చెక్కి

## ఇష్టం

"నా పాఠం వినడానికి ఇష్టం లేని వారు నిర్భయంగా వెళ్ళిపోవచ్చు-" అన్నారు ఉపాధ్యాయుడు

చివరి బెంచీలో పది మంది తప్ప మిగిలిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. "మీరు నా పాఠాలు వినడానికి ఇష్టపడుతున్నా రన్నమాట?" సంతోషంగా అడిగాడు ఉపాధ్యాయుడు.

"మాస్టారూ, మీ రేం అంటున్నారు? మిగతావా రేమయ్యారు?" కళ్ళు తెరుస్తూ ఆవలిస్తూ అన్నా రా పదిమందీ.

నందిగాం మురళీమోహన్

## ఏకాంతం

గోపీనాథ్: స్వప్నా! ఈ రోజు మన కోసం మూడు సినిమా టిక్కెట్లు తీసుకున్నాను.

స్వప్న: మూ డెందుకు? మ నిద్దరమేగా!

గోపీనాథ్: రెండు మా అమ్మా నాన్నలకి, మూడోది మీ తమ్ముడికి.

చుక్కపల్లి సత్యనారాయణ

అంతవరకు మగవాళ్ళ కోపానికి మరింత దోహదం చేస్తున్న ఆడవాళ్ళు గుండెలు చేత పట్టుకొని నువ్వు ముందా, నేను ముందా - అని గుడారంలోకి దూరుతున్నారు.

అదృష్టవశాత్తు అదే సమయానికి దారి కావలాగా నడుస్తున్న ఆలయ సిబ్బంది అక్కడికి చేరుకొనింది. పరిస్థితిని గ్రహించింది. పెద్దపెట్టున టపానులు పేల్చింది. ఎంత పెద్దపులి అయినా దాని ప్రాణం దానికి తీపే గదా? ఈ హాహాకారాలకు తుపాకుల శబ్దానికి తోక ముడిచినట్లుంది.

దాని అలికిడి లేకుండా పోయేసరికి అందరు 'హమ్మయ్య' అంటూ నిట్టూర్చినారు.

"యా ఖుదా !... బచావో సర్కార్ ! ముకర్ అల్లా హమే బచాయే !... యా అల్లా ! యా అల్లా !" అంటూ మోకాళ్ళమీదికి వంగి మహమ్మదీయులు అల్లాను ప్రార్థిస్తున్నారు.

"ఓ దేవా ! మేము చెప్పు ముక్కల్ని చెవిని వేసుకొంటిరి. ఈ పాపము నుండి... భయమునుండి మముల రక్షించితిరి. దేవా ! ఈ లోకమున కంతకు నీవే దేవుడవు !" అంటూ క్రైస్తవులు నిమీలిత నేత్రులై నిలబడి కుడి భుజాన్నుండి ఎడమ భుజానికి, ఎడమ భుజాన్నుండి కుడి భుజానికి, ఆమీదట నుదుటి మీదికి కుడి చేతిని నాట్యం చేస్తున్నారు.

"శరణం అయ్యప్పా ! శరణం అయ్యప్పా ! శరణ మయ్యప్పో ! నీ వాహనాన్నే పంపి ఈ గండాన్నుండి గట్టెక్కించినావు" అంటూ మా స్వాములు అరుస్తున్నారు.

ఆ స్థితిలో వాళ్ళను చూస్తుంటే ఆ ముందటి క్షణంవరకు వీళ్ళేనా ఒకరిమీ దొకరు కారాలు మిరియాలు నూరుతూ కయ్యానికి కాలు దువ్వింది? వీళ్ళేనా అర్ధరహితమైన ఆవేశాలతో మానవత్వాన్నే కోల్పోయి రక్తపాతానికి రహదారి వేసింది?" అన్న సందేహం కలుగుతూ ఉంది. ఆ మనుమ లందరూ జంతువులైన వేళను తలచుకొంటూంటే అవసరం మనిషిని స్వార్థుణ్ణి చేస్తే, స్వార్థం మనిషిని జంతువుగా మారుస్తుందేమో - అనిపిస్తూ ఉంది. ఆ జంతువే నయం. నేను పరిష్కరించలేని సమస్యను సునాయాసంగా పరిష్కరించింది.

ఆ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూస్తుంటే పులీ మేకలు ఒక రేవులో నీళ్ళు తాగుతున్నట్లు, పిల్లీ ఎలుకలు కలిసి కాపురం చేస్తున్నట్లు మానవజాతి కలలు గంటున్న అపూర్వ సమైక్యత సాధించినట్లు నా గుండె పూచి కాచిన చెట్టే అయింది.

అయినా అది క్షణికమే కదా !

అదే సమయానికి ఎక్కడో చర్చిలో ఒక ఫాదర్ ఏసుక్రీస్తు ఒక్కడే దేవుడని ప్రవచిస్తూ ఉంటాడు. ఒక మసీదులో మౌలాలీ 'అల్లాహొ ! అక్బర్ !' అని తన అనుచరులకు బోధిస్తూ ఉంటాడు. ఏ గుడిలోనో హైందవ గురువు 'ఏకో నారాయణో హరి' అని ఎలుగెత్తి చాటుతూ ఉంటాడు.

ఇది భిన్నత్వం !

ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించే దెవ్వడో! అని ఆలోచించే కొద్దికీ నా గుండె బాధగా మూలిగింది. నాలో ఇంకా చావని ఆశల్లా ఆకాశంలో నక్షత్రాలు మినుక్కు మినుక్కు మంటున్నాయ్.

అడవి మాత్రం ఈ బాధను గ్రహించినట్లు ఆ చీకటిలో రోదిస్తూ ఉంది. ✱

